క్లుప్తంగా

119 మందికి వైద్య సేవలు



పైడంపేటలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలను రోగులు కచ్చితంగా పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పైడంపేటలో 119 మందిని పరీక్షించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి నెలా రెండుమార్లు గ్రామంలోకి ఫ్యామిలీ డాక్టరు సేవలందించనున్నట్లు వివరించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెడ్డీ గ్యాంగ్‌పై అప్రమత్తం



చెడ్డీ గ్యాంగ్‌కు సంబంధించి పోస్టర్లు అంటిస్తున్న పోలీసులు

గొలుగొండ: ఇటీవల జిల్లాలో కలకలం సృష్టించిన చెడ్డీగ్యాంగ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ కృష్ణదేవిపేట, గొలుగొండ పోలీసులు వాల్ పోస్టర్ల ప్రచారం నిర్వహించారు. ప్రధాన కేంద్రాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కృష్ణదేవిపేట, గొలుగొండ ఎస్ఐలు ఉపేంద్ర, నారాయణరావుల ఆధ్వర్యంలో ప్రధాన కేంద్రాల్లో నిఘా ఏర్పాటు చేశారు. ప్రజలు ఇళ్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

వాలీబాల్ విజేత విజ్ఞాన్ కళాశాల



విజ్ఞాన్ కళాశాల జట్టుకు ప్రథమ బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

మాకవరపాలెం: వాలీబాల్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ కళాశాల విద్యార్థినులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. మండలంలోని తామరం అవంతి కళాశాలలో విజయనగరం జేఎన్‌టీయూ పరిధిలో ఉన్న కళాశాలల విద్యార్థులతో ఇంటర్ కాలేజియేట్ మహిళా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎనిమిది కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగిన పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ విద్యార్థినులు ప్రథమ, విజయనగరం జేఎన్‌టీయూ విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు శుక్రవారం బహుమతులు అందజేశారు. త్వరలో తిరుపతిలో జరగనున్న సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు జట్టును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రామచంద్రరాజు, జేఎన్‌టీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్లు ఎల్లారీశ్వరి, రాజలక్ష్మి, ఇతర కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రెండు ఆలయాలలో చోరీ



దేవరాపల్లి మరిడిమాంబ ఆలయంలో తాళాలు పగలుకొట్టిన హుండీ

దేవరాపల్లి: మండలంలోని దేవరాపల్లి, చేనుపాలెం గ్రామాల్లో ఆలయాలలో మూడు హుండీల్లో నగదును గురువారం రాత్రి చోరీ చేశారు. దేవరాపల్లిలోని మరిడిమాంబ ఆలయంలో రెండు హుండీలు, మారేపల్లి శివారు చేనులపాలెంలోని పరదేశమ్మ ఆలయంలో ఒక హుండీ తాళాలను పగలు కొట్టి వాటిలో నగదును అపహరించుకుపోయారు. దేవరాపల్లి మరిడిమాంబ ఆలయ హుండీలో సుమారు రూ.25 వేల నగదుతో పాటు భక్తులు హుండీలో వేసిన రెండు గ్రాముల బంగారం, ఐదు తులాల వెండిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హుండీ దొంగతనం విషయమై పోలీసులకు సమాచారం అందించామని వారు చెప్పారు.



చీడికాడ: పుట్టలో పాలుపోస్తున్న భక్తులు



కె.కోటపాడు: చౌడువాడలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



గొలుగొండలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చల్లంగా చూడు నాగన్నా..

'పడగ తొక్కిన పగవాడనుకోకూ, నడుము తొక్కిన నా వాడనుకొనుమూ, తోక తొక్కిన తొలగుచు పొమ్మా' అని నాగేంద్రుడిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన నాగుల చవితి వేడుక శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

- భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

మాడుగుల రూరల్/చోడవరం/బుచ్చెయ్యపేట/రోలుగుంట/నాతవరం/చీడికాడ/మాకవరపాలెం/కె.కోటపాడు/గొలుగొండ: నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో అన్ని గ్రామాల్లోనూ నాగుల చవితి వేడుక భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉదయం 6 నుంచి 8.20 గంటల వరకు మరలా 9.10 నుంచి 11.36 గంటల వరకు పాలు పోయుటకు శ్రేయస్కరమని ఆగమన పండితుల సూచన మేరకు ఎక్కువ మంది నాగుల చవితి చేశారు. ఉదయం నుంచి పుట్టల వద్ద పూజలు చేసి, తంగిడి, తులసి పత్రిలతోపాటు చిమ్మిడి, పాలు, తాటిగుంజు, అరటిపండ్లు వేసి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. భారీగా బాణసంచా పేల్చారు. నాగేంద్రునికి పూజలు చేశారు. పలు గ్రామాల్లో కోలాటాలు, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, కబడ్డీ, వాలీబాల్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం నాగుల చవితి సందర్భంగా పుట్టలో పాలు పోశారు.



మాడుగులలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న కుటుంబ సభ్యులు



రోలుగుంటలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



మాడుగుల రూరల్: ఎం. కోడూరులో పుట్టలో పాలు వేస్తున్న భక్తులు



మాడుగుల రూరల్: కె.జె.పురంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



నాతవరం: కుటుంబ సమేతంగా పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు



చీడికాడ: క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రంథాలయంలో రీడింగ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు రీడింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకురాలు వి.శృతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో పాటుపడిన ఉద్యమకర్తల చిత్రపటాలు వద్ద ఘన నివాళులర్పించారు. వంటర్లపాలెం బీడీఎస్ సిబ్బంది దోని చినఅప్పారావు, గ్రంథాలయ సిబ్బంది పి. అప్పలనర్సమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

చీడికాడ: స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం ఉదయం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకురాలు జోగీశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు.

జనం కోరుకుంటున్న నాయకుడు జగన్

పల్లె నిద్రలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు



పల్లె నిద్రలో బస చేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు

దేవరాపల్లి: అర్హతే ప్రామాణికంగా లంచాలకు ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న మరో మారు ముఖ్యమంత్రి కావాలని జనం కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు తెలిపారు. పల్లె నిద్రలో భాగంగా దేవరాపల్లి సచివాలయం-2 పరిధిలో శుక్రవారం రాత్రి బస చేశారు. స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అక్కడే భోజనం చేసి నిద్రించారు. సబ్బవరపు మాలిబాబు, సచివాలయ కన్వీనర్లు బంధం అప్పలరాజు, ఆతవ మహేష్, బొడ్డు వెంకటరావు, యర్రా కన్నబాబు, మిడతాడ శ్రీను, షేక్ అప్పాసాహెబ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీల విజేత కేజేపురం



పోటీల్లో దౌడు తీస్తున్న ఎద్లు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

చోడవరం: జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీల్లో కేజేపురానికి చెందిన కాళ్ల అప్పలనాయుడు ఎడ్లు మొదటి స్థానంలో నిలిచాయి. నాగుల చవితి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు శీరంరెడ్డి వెంకటరమణ ఆధ్వర్యంలో లక్కవరంలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు జరిగాయి. ఈ పందెంలో జిల్లా నలుమూలల నుంచి 26 ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. వీటిలో అర్జునగిరికి చెందిన పరవాడ నాయుడు ఎడ్లు ద్వితీయ, నర్సయ్యపేటకు చెందిన ముమ్మిన శివతేజ ఎద్లు తృతీయ, వల్లంపూడికి చెందిన ఏడువాక సత్తిబాబు ఎండ్లు నాల్గో స్థానం, చుక్కపల్లికి చెందిన అద్దిపల్లి పాలవెల్లి ఎడ్లు ఐదో స్థానంలో నిలిచాయి. ప్రత్యేక బహుమతులను ముమ్మిన రామకృష్ణ (నర్సయ్యపేట), సిద్ధి వినాయక (లక్కవరం), జనపరెడ్డి హేమశ్రీ (నర్సయ్యపేట) దక్కించుకున్నాయి. ఆయా ఎడ్లబళ్ల యజమానులకు నాయకుడు శీరంరెడ్డి వెంకటరమణ, ఉప సర్పంచ్ బండారు నాయుడు నగదు బహుమతులు అందజేశారు.

మద్యం విక్రేత అరెస్టు

మాకవరపాలెం: వజ్రగడలో 20 మద్యం సీసాలు పట్టుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. గ్రామానికి చెందిన తమరాన శ్రీను బెల్టు దుకాణం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో శుక్రవారం దాడి చేశామన్నారు. ఈ దాడిలో 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

ఏళ్ల నాటి వీధి రోడ్డు సమస్యకు మోక్షం



ములగపూడిలో సిమెంటు రోడ్డు వేస్తున్న కూలీలు

నాతవరం: ఏళ్ల నాటి నుంచి వెంటాడే వీధి రోడ్డు సమస్యకు మోక్షం లభించింది. ములగపూడి గ్రామం మధ్యలోంచి కొండ గెడ్డ ప్రవహిస్తోంది. వర్షాల సమయంలో గెడ్డ నీటి ప్రవాహం కారణంగా గ్రామంలో వీధులన్నీ అధ్వానంగా తయారై రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. ఈ సమస్యను ఏళ్ల తరబడి అధికారులు, నాయకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రధాన సమస్యగా ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి రూ.10 లక్షలు మంజూరు చేసి సీసీరోడ్డు నిర్మాణానికి స్వయంగా భూమి పూజ చేశారు. యుద్ధప్రాతిపదికన రోడ్డు పనులు ప్రారంభించి ప్రజల ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల సంబరం

ఉత్సవాల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ఉత్సవాల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



శివుడు, యముడు, భక్త మార్కండేయ వేషధారణలో బళ్ల వేషాలు

కె.కోటపాడు: ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ ఆధ్వర్యంలో కె.కోటపాడులో శుక్రవారం గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు చేశారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరై గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ఏటా నాగుల చవితి పర్వదినం రోజున కె.కోటపాడులో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను గ్రామస్తులు ఐక్యతతో నిర్వహించుకోవడంతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. గ్రామంలో పలు ప్రధాన వీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తమార్కండేయ, యముడు, శివుని, తదితర దేవుళ్ల వేషధారణలతో బళ్ల వేషాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉప సర్పంచ్ రెడ్డి అరుణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, కొత్తపెంట సర్పంచ్ రొంగలి వెంకటరావు, చల్లా మంగ, బోళెం సందీప్, దొగ్గ ఉమాశంకర్, యడ్ల దేముళ్లు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



సత్కారం పొందిన కవులతో గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు, సభ్యులు

అనకాపల్లి టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం కవి సమ్మేళనం జరిగింది. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈ సమ్మేళనానికి సాహితీ మిత్రుల కన్వీనర్ యిమ్మిడిశెట్టి చక్రపాణి సహచర మిత్రులకు స్వాగతం పలికి గ్రంథాలయాలు-సాహిత్యంపై ప్రసంగించారు. కథా రచయిత గొంతిన రంగబాబు నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో కవులు పుస్తకాలు, గ్రంథాలయాలు అంశాలపై కవితలు- పాటలు వినిపించి ఆకట్టుకున్నారు. కవులు, కవయిత్రులు రాయవరపు సరస్వతి, రేగురగడ్డ వెంకటలక్ష్మిగాయత్రి, జీఎస్‌కే సాయిబాబా, కర్రి మల్లీశ్వరి, కోరాడ అప్పలరాజులను గ్రంథపాలకుడు కె.శ్రీనివాసరావు సత్కరించారు.

అయ్యప్ప నిత్యాన్నదానానికి రైతు సంఘం వితరణ

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీ సంఘం అయ్యప్పస్వామి ఆశ్రమంలో అయ్యప్ప భక్తు లకు నిత్యాన్నదానం చేస్తున్న సంఘ సభ్యులకు రైతు సంఘం ఆశ్రమం తరపున 30 బియ్యం బస్తాలు, 5 నూనె డబ్బాలు, కొంత నగదు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం ప్రతినిధులు కొణతాల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఏటా ఆశ్రమంలో ఉన్న స్వాములకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు మళ్ల సురేంద్ర, పీలా రాముడు, సూరిబాబు, కొణతాల పండు, పీలా శ్యామ్, పురుషోత్తం, విల్లూరి హరి పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయండి

ఆర్డీవో హెచ్.వి.జయరాం



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులకు సూచించారు. తుది ఓటరు జాబితా ప్రక్రియపై తన కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. మండలాల వారిగా ఓటరు జాబితా ప్రక్రియపై అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు ఉండాలని సూచించారు. చనిపోయినా లేదా శాశ్వతంగా వేరే ప్రదేశానికి మారిన వారి ఓట్లు తొలగించడానికి ప్రత్యేక ఫారాలను విడివిడిగా ఇవ్వాలన్నారు. సవరణలన్నీ పూర్తయిన తర్వాత ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా జనవరి 5న ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. ఒకే ఫొటో ఇద్దరికి నమోదైనప్పుడు వాటిని ప్రాథమికంగా విచారించి పరిష్కరించాలన్నారు. ఒక ఓటరు రెండు చోట్ల ఓటుహక్కు కలిగి ఉంటే, వారికి నోటీసు పంపి ఒక దగ్గర మాత్రమే వినియోగించేటట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు. ముసాయిదా జాబితాకు సంబంధించి మినిట్ రూపంలో రికార్డు నిర్వహించాలన్నారు. ఫారం-6, 7, 8 సంబంధించిన వివరాలు రికార్డులో పక్కాగా ఉండాలని ఆదేశించారు.

రోలుగుంటలో వేడుకగా జాజాల పండగ

- ఆకట్టుకున్న బాలికల చిడతల పోటీలు
- భక్తిశ్రద్ధలతో గౌరీపరమేశ్వరులకు పూజలు



వీక్షకులను ఆకట్టుకున్న చిడతల పోటీలు



గౌరీ పరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: జాజాల పండగ ఘనంగా జరిగింది. రోలుగుంటలో గౌరీపరమేశ్వరుల చినతీర్థం సందర్భంగా ఏటా కార్తీక మాసంలో ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు జాజాలతో చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతల లక్ష్మీశ్రీనివాస్, జెడ్పీటీసీ లక్ష్మీరమణమ్మ, ఆలయ కమిటీ సభ్యుడు అల్లు ఎర్రినాయుడు, రావాడ మణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు మడ్డు శివకుమార్ ఉత్సవమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ ఆలయం వద్ద మండల స్థాయిలో మహిళలకు, బాలికలకు చిడతల పోటీలను నిర్వహించారు. కె.నాయుడుపాలెం, పాపంపేట, రోలుగుంట తదితర గ్రామాల నుంచి వచ్చిన చిడతల బృందాలు గౌరీపరమేశ్వరులకు ఇష్టమైన గీతాలు ఆలపించి పోటాపోటీగా తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రతిభ చూపిన జట్లకు బహుమతులను శనివారం అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

సంక్షేమ సారథి జగన్‌ను సీఎంగా మళ్లీ గెలిపించాలి

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి



దేవరాపల్లిలో ఇంటింటా పర్యటించి కరపత్రాలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: నవరత్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ సారథి జగన్‌ను ముఖ్యమంత్రిగా మరోమారు ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కోరారు. దేవరాపల్లి సచివాలయం -1,2 పరిధిలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అధ్యక్షతన రెండో రోజు శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి గత టీడీపీ పాలనలో అవినీతి, అరాచకాలను, ప్రస్తుత జగన్ పాలనలో చేసిన సంక్షేమ అభివృద్ధిని ప్రజలకు ఆయన వివరించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన టీడీపీ పాలనకు, ఇచ్చిన మాట ప్రకారం రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా పథకాలు అందిస్తున్న జగన్ పాలనకు మధ్య తేడా గుర్తించాలని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమంలో విప్లవాత్మక పాలనతో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే దిక్సూచిగా నిలిపిన జగన్‌ను మరో మారు గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలం నాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, ఉగ్రాకుల అప్పారావు, వరదపురెడ్డి లలితానాయుడు, సచివాలయ కన్వీనర్లు గొర్రుపోటు రమాదేవి, బంధం అప్పలరాజు, ఆతవ మహేష్, సామిరెడ్డి పేరునాయుడు, కొరుపోలు శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ప్రయోజనాలపై డీసీసీబీ చైర్మన్‌కు వినతి



డీసీసీబీ చైర్మన్ కోలా గురువులుకు వినతిపత్రం అందజేస్తున్న సహకార రిటైర్డ్ ఉద్యోగులు

మాడుగుల: ప్రాథమిక సహకార సంఘాల్లో గ్రూపు డి.కేడరుగా పనిచేసి, డీసీసీబీ సర్వీసులోకి విలీనమై ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ, ఆర్జిత సెలవుల పరిహారం చెల్లించాలని డీసీసీబీ చైర్మన్ కోలా గురువులుకు డీసీసీబీ రిటైర్డు ఉద్యోగుల యూనియన్ ఉపాధ్యక్షుడు మాకిరెడ్డి వెంకటరమణ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. 1999లో బ్యాంకు సర్వీసులో చేరి 2009 వరకు జీతభత్యాలు క్రమబద్ధీకరణ కాక, లక్షలాది రూపాయలతోపాటు పదవీ విరమణ ప్రయోజనాలను నష్టపోయారన్నారు. ఇటీవల హైకోర్టు 20 నెలలు జీతం గ్రాట్యుటీగాను, 240 రోజులు ఆర్జిత సెలవు పొందుటకు అర్హులుగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీనిపై చైర్మన్ స్పందించి ఈ విషయమై రాష్ట్ర స్థాయి సమావేశంలో చర్చకు వచ్చిందని, ఈ సమస్య మూడు జిల్లాల్లో ఉందన్నారు. ఆయా డీసీసీబీ చైర్మన్లతో సంప్రదించి మేలు చేకూరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీసీసీబీ రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.జె.ఆర్. మూర్తి, ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, కార్యవర్గ సభ్యులు పైడిరాజు, వి. నాగేశ్వరరావు, ఆర్. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం రేపు



మామిడిపల్లిలో ప్రారంభానికి సిద్ధంగా సచివాలయ భవనం



మామిడిపల్లిలో ప్రారంభానికి ముస్తాబవుతున్న ఆర్బీకే భవనం

దేవరాపల్లి: మామిడిపల్లిలో పలు అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ కర్రి సూరినాయుడు, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నూతన విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని, రూ.20 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారన్నారు. జలజీవన్ మిషన్‌లో రూ.60 లక్షలతో నిర్మించిన మంచినీటి ట్యాంక్‌తోపాటు ఇంటింటి కుళాయిలను, నాడు-నేడులో అభివృద్ధి చేసిన పాఠశాలల భవనాలను ప్రారంభిస్తారన్నారు. మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.